ప్రజాశక్తి
గురువారం 30 అక్టోబర్ 2025
5



బ్యాడ్మింటన్ పోటీల్లో అభిషేక్ ప్రతిభ



బ్రాంజ్ మెడల్ అందుకుంటున్న అభిషేక్

ప్రజాశక్తి - రామచంద్రపురం

యోనెక్స్-సన్ రైజ్ ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ లో మోడరన్ విద్యార్థి అభిషేక్ బోస్ ప్రతిభ కనబరిచారు. తమిళనాడు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధురైలో జరిగిన పోటీల్లో రామచంద్రపురం మోడరన్ జూనియర్ కాలేజీ విద్యార్థి బోను అభిషేక్ డబుల్స్ కేటగిరిలో ఆల్ ఇండియా అండర్ - 19 విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు మోడరన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు బుధవారం తెలిపారు. అభిషేక్‌ను జివి.రావు, అకాడమిక్ డైరెక్టర్ కె. సాయిరాం చౌదరి, మోడరన్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్, వైస్ ప్రిన్సిపల్ పి.ఎస్. ప్రకాష్ తదితరులు అభినందించారు.

మొంథా మిగిల్చిన నష్టం

- కూలిపోయిన విద్యుత్ స్తంభాలు, నేలకొరిగిన వృక్షాలు
- నేలనంటిన వరి చేలు, దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- పునరుద్ధరణకు చర్యలు చేపట్టిన అధికారులు



నిడసనమెట్టలో నీట మునిగిన వరి చేను చూపుతున్న రైతు

ప్రజాశక్తి - యంత్రాంగం

మొంథా తుపాను డాక్టర్ బిఆర్.కోనసీమ అంబేద్కర్ జిల్లాకు నష్టాన్ని మిగిల్చింది. జిల్లాపై తీవ్ర ప్రభావం చూపించింది. వరి, ఉద్యాన పంటలు వేల ఎకరాల్లో నేలకొరిగాయి. విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది. కొబ్బరి చెట్లు, భారీ వృక్షాలు నేల కూలాయి. అధికార యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టి పలుచోట్ల విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించింది. అధికారులు, ప్రజాప్రతినిధులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. రహదారులపై పడిన వృక్షాలను ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలతో యుద్ధప్రాతిపదికన తొలగించే చర్యలు చేపట్టారు.

అమలాపురం: తుపాను ప్రభావం వల్ల పలు చోట్ల చెట్లు పడిపోవడం వల్ల జిల్లాలో 275 విద్యుత్తు స్తంభాలు నేలకూలాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ 1.67లక్షల ఎకరాల ఆయకట్టు సాగు అవుతోంది. మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో 34,762 ఎకరాల వరి చేలు ప్రభావానికి గురయ్యాయి. దీనిలో 11,375 ఎకరాల్లో పంట నీట మునగగా 23,387 ఎకరాల్లో పంట నేలకొరిగింది. ఉప్పలగుప్తం మండలంలో తుపాను సందర్భంగా రోడ్లపై పడిన చెట్లను డిప్యూటీ తహశీల్దార్ జి.లలిత, ఎంఆర్ఐ జి.నాగూర్ మీరాసాహెబ్ లు ఎన్ డి ఆర్ ఎఫ్ దళాలతో కలిసి తొలగించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో సాయంత్రానికి కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మండలం లోని 17 గ్రామ పంచాయతీల పరిధి లో 22 పునరావాస కేంద్రాల్లో 2258 తుపాను బాధితులకు భోజన వసతులు కల్పించామని 23 ఎకరాలు,25 పక్కా ఇళ్లు దెబ్బతిన్నట్లు గుర్తించామని డిటి లలిత తెలిపారు. కపిలేశ్వరపురం మండలంలో మొంథా తుఫాన్ గండం తప్పడంతో కపిలేశ్వరపురం మండలంలో 21 పునరావస కేంద్రాల్లో ఆశ్రమం పొందిన 924 మంది తుఫాను బాధితులు బుధవారం వారి ఇళ్లకు తరలి వెళ్లారు. గాలులు, వర్షం,లేకపోవడంతో వారి స్వగృహాలకు చేరుకున్నట్లు తహశీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు. లంక గ్రామాలకు మినహా మండలంలోని మిగిలిన గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్దించడం జరిగిందన్నారు. బుధవారం సాయంత్రానికి లంక గ్రామాలకు కూడా విద్యుత్ సరఫరా జరగనున్నట్లు తెలిపారు. అంగర టేకి గ్రామాల్లో ఒక రేకులు చెడు, ఒక పెంకుటిల్లు పాక్షికంగా దెబ్బతిందన్నారు. మామిడికుదురు మండలంలో మొంథా తుఫాను కారణంగా టెలికాం సేవలు, ముఖ్యంగా కొన్ని మొబైల్ నెట్‌వర్క్‌లో తీవ్ర అంతరాయం కొనసాగుతోంది. నెట్‌వర్క్ పూర్తిగా నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుపాను వల్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతినడంతో చాలా సెల్ టవర్లకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కరెంట్ లేకపోవడంతో టవర్లు బ్యాకప్ జనరేటర్లపై ఆధారపడుతున్నాయి. అయితే, ఈ జనరేటర్ లు కూడా నిలిపి వేయడంతో నెట్‌వర్క్ సేవలుపూర్తిగా నిలిచిపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో తమ బంధువులను, అధికారులను సంప్రదించలేక పోతున్నామని, ముఖ్యంగా సమాచారం తెలుసుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం నుండి విద్యుత్ సరపరా నిలిచిపోయింది ఈరోజు కూడా సరఫరా పునరుద్ధరణ కాలేదు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలం, కాజులూరు మండలం, రామచంద్రపురం రూరల్ లోనే పంట పొలాలు అధిక శాతం భారీ వర్షాలు, ఈదురు గాలులకు నేలకొరిగి పోయాయి. దీంతో అధిక శాతం రైతులు నష్టాలు చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రామచంద్రపురం నియోజకవర్గంలో మొత్తం 31 వేల ఎకరాల్లో వరిసాగు అవుతోంది. సఖినేటిపల్లి మండలంలో తుపాను ధాటికి సఖినేటిపల్లి మండలంలో తీర ప్రాంత గ్రామాలైన కేశవదాసుపాలెం, అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం గ్రామాలతో పాటు మిగిలిన గ్రామాల్లో భారీగా చెట్లు పడిపోయి, విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. విద్యుత్ సరఫరా నిలిచివే యబడటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. రెవెన్యూ పంచాయతీరాజ్ పోలీస్ వ్యవస్థ సంయు క్తంగా పనిచేయగా, రోడ్లపై పడిన చెట్లను ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది కట్టర్ల సహాయంతో కట్ చేసి చెట్లను తొలగించారు. ఒక్క సఖినేటిపల్లి మండలంలోని 150పైగా నేలకొరిగాయి. 16 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహించి బుధవారం రాత్రికే మండలంలో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేశారు.



గొంది గ్రామంలో నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రైతులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

పూడికలు తీయించండి సారూ...

ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన ముంపు పొలాల రైతులు



తుపాను బాధితులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - అమలాపురం

పొలాల నుంచి మురుగు వెళ్లే డ్రెయిన్లు పూడుకు పోవడంతో తరచూ ముంపునకు గురవుతున్నామని, వెంటనే పూడికలు తీయించండి సారూ... అంటూ ముంపునకు గురైన రైతులు సిఎం చంద్రబాబును వేడుకున్నారు. బుధవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో సిఎం చంద్రబాబు పర్యటించారు. తొలుత తుపాను బాధిత ప్రాంతల్లో ఆయన ఏరియల్ సర్వే చేశారు. అనంతరం ఓడలరేవులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. తుపాను బాధితులతో మాట్లాడారు. అందుతున్న వసతులపై ఆరా తీశారు. నిర్వాసితులకు ఆర్థిక సాయం అందించారు. బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తరువాత బెండమూరిలంక శివారు ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు వారి సమస్యలను ఏకరువు పెట్టారు. తమకు సాగునీరు ఆలస్యంగా విడుదలవుతుందన్నారు. ముందుగానే విడుదల చేస్తే తమ పంటలను తుపానుల నుంచి కాపాడుకోగలుగుతామన్నారు. జిల్లా వ్యాప్తంగా మురుగు నీటి డ్రెయిన్లు పూడుకు పోయాయని, ఫలితంగా వర్షాలు, వరదల సమయంలో పొలాల్లో నీరు దిగక ముంపునకు గురవుతున్నామని వాపోయారు. పూడికలు తీయిస్తే తమ పొలాలు ముంపు నుంచి బయటపడతాయని ముక్తకంఠంతో కోరారు. దీనిపై సిఎం మాట్లాడుతూ సన్న రకం వరి వంగడాలు వేయాలన్నారు. తమ ప్రాంతానికి సన్న రకాలు పెద్దగా దిగుబడిని ఇవ్వవని రైతులు తెలిపారు. భూసారాన్ని బట్టి స్వర్ణ రకమే మంచి దిగుబడిని ఇస్తుందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి శాస్త్రవేత్తలతో మాట్లాడారు. సన్నాల వరి వంగడాలు సాగు చేసేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. పంట నష్టాలను త్వరగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా సిఎం మాట్లాడారు. నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. పంటలపై బీమా ప్రీమియం చెల్లించి ఉంటే అది కూడా అందేలా చూస్తానన్నారు. జిల్లాలో నష్టం వాటిలినప్పటికీ పెనుముప్పు నుంచి బయట పడిందన్నారు. తుపాను బాధితులకు, రైతులకు సర్కారు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తుపాను వల్ల ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, నేతన్నల కుటుంబాలకు రూ.5వేల చొప్పున పరిహారం అందిస్తామన్నారు. బియ్యం, ఇతర నిత్యావసరాలు అందిస్తామన్నారు. ఆయన వెంట మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎంపీ హరీష్‌మాథూర్, ఎంఎల్‌ఎలు ఆనందరావు, దాట్ల సుబ్బరాజు, ప్రత్యేక అధికారి వి.విజయరామరాజు, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జెసి నిశాంతి, డిఆర్ఒ కె.మాధవి తదితరులున్నారు.



తుపానునష్టాన్ని తెలుసుకుంటున్న సిఎండి

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మొంథా తుపాను కారణంగా ఏర్పడిన విద్యుత్ అంతరాయాన్ని త్వరితగతిన పునరుద్ధరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు విద్యుత్ సిఎండి ముమ్మిడి పథ్వీ తేజ్ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక సబ్‌స్టేషన్‌ను బుధవారం సిఎండి సందర్శించారు. తుపాను కారణంగా జరిగిన నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఐదు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ధ్వంసం కాగా, ఈదురుగాలులకు చెట్లు పడి 25 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని వివరించారు. పునరుద్ధరణ చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి సాయంత్రానికి విద్యుత్‌ను పునరుద్ధరించాలని ఆదేశించారు. అనంతరం మండంలోని క్రాప చింతలపూడి గ్రామంలో విరిగిపడిన విద్యుత్ స్తంభాలను ఆయన బుధవారం ఉదయం పరిశీలించారు. అదే విధంగా ఎన్ని చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ఎడిఇ శ్రీనివాస్‌ను ఆరా తీశారు. ఈ సందర్భంగా కర్నూలు నుంచి వచ్చిన విద్యుత్ శాఖ సిబ్బందితో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టామన్నారు. ఆయన వెంట ముమ్మిడివరం ఎడిఇ డి.శ్రీనివాస్, కర్నూల్ టౌన్ ఎడిఇ కె.నాగ ప్రసాద్, ముమ్మిడివరం విద్యుత్ శాఖ జెఇ కె.శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరి పొలాల పరిశీలన



గంగలకుర్రులో వరి పంటను పరిశీలిస్తున్న ఎంపి హరీష్, ఎంఎల్ఎ గిడ్డి



జొన్నాడలో దెబ్బతిన్న వరి చేలను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ సత్యానందరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

మొంథా తుపాను కారణంగా జిల్లా పలుచోట్ల దెబ్బతిన్న వరిచేలను ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం పరిశీలించారు. వివరాలు ఇవి..

రామచంద్రపురం: తుఫాన్ కారణంగా రామచంద్రపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నీట మునిగి, నేలమట్టమైన పంట పొలాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసనశెట్టి శుభాష్ బుధవారం పరిశీలించారు. నియోజకవర్గంలోని ఓదూరు, చేదువాడ, తర్లంపూడి, శీల గ్రామాల్లో పంట పొలాలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రైతులతో మాట్లాడి ప్రతి ధాన్యం గింజా కొనుగోలుకు చర్యలు చేపడతామని పంట నష్టం పై ముఖ్యమంత్రికి వివరిస్తానన్నారు. నియోజకవర్గంలో 51 వేల 800 ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతుందని, భారీ వర్షాలు, తుఫాను తాకిడికి 80 శాతం మేర పంట పొలాలు నేలమట్టం అయ్యాయని ఆయన వివరించారు. పంట నష్టం వివరాలను ఒక సమగ్ర నివేదిక అందజేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రామచంద్రపురం, కె. గంగవరం, కాజులూరు మండలాల్లో ఖరీఫ్ పంటలు సాగులో ఉన్నాయని, అందులో సుమారు 41 వేల ఎకరాల్లో పంటలు నేలమట్టం అయినట్టు గుర్తించామన్నారు. ప్రస్తుతం పంటలు గింజ గట్టిపడే దశ నుండి పాలు నిండే దశలో ఉన్నాయన్నారు. పంటలు చేతికొచ్చే దశలో తుఫాన్, అకాల వర్షాల కారణంగా పంటలు నేలకొరిగి రైతాంగం ఆందోళన చెందుతున్నారని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల పరిశీలనలు చేసి నష్టపోయిన రైతులకు అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆయన వెంట వ్యవసాయ అధికారులు, కూటమి పార్టీ నాయకులు తదితరులున్నారు. **ఆలమూరు:** తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని పెనికేరు, కలవచర్ల, ఆలమూరు, జొన్నాడ తదితర గ్రామాలలో వరి చేలను బుధవారం అధికార యంత్రాంగం, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి ఆకుల రామకష్ణలతో కలసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ వరితోపాటు ఉద్యానవన పంటల నష్టాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా వేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు కార్యక్రమంలో తుపాను ప్రత్యేక అధికారి లక్ష్మీ ప్రత్యూష, తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, ఎంపిడిఒ ఎ.రాజు, మండల ఎఒ బి.మీనా, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఉచ్చిలి గ్రామంలో నేలకొరిగిన వరి పంట మరియు విరిగిన అరటి చెట్లనుపరిశీలించారు.కార్యక్రమంలో మండల నాయకులు, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** మండలంలోని 14 రెవెన్యూ గ్రామాల్లో 2128 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వ్యవసాయ శాఖ ఎడి జి.కెనడీ మండలంలో తుపాను ప్రభావానికి గురైన వరి చేలను బుధవారం మండల వ్యవసాయ అధికారి జి.కుమార్ బాబుతో కలిసి పరిశీలించారు. **మామిడికుదురు:** తుపాను ధాటికి పెదపట్నం లంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి, పెదపట్నం, నగరం, పాశర్లపూడి, తదితర గ్రామాలలో కొబ్బరి చెట్లు పడిపోయాయి. అరటి పంటకు నష్టం వాటిల్లింది. మామిడికుదురు, గెద్దాడ, ఈదరాడ, కొమరాడ, ఆదుర్రు, తదితర గ్రామాలలో వరి నేల కొరిగింది. **అంబాజీపేట:** గంగలకుర్రు, మోసలపల్లి గ్రామాలలో మొంథా తుపాన్ ప్రభావతం వల్ల నష్టపోయిన పంట పొలాలను ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణతో కలసి ఎంపీ హరీష్ పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారు. మండలంలో 3,063 ఎకరాలలో వరి సాగు చేశారని, తుపాను కారణంగా వరి పంట నేలకొరిగిందని వాటి అంచనా పరిశీలనలో ఉన్నట్లు ఎఒ కె.ధర్మ ప్రసాద్ ఎంపీకి తెలిపారు. ఆయన వెంట తహశీల్దార్ చినబాబు, కూటమి శ్రేణులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, గూడాల ఫణి, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, సొసైటీ అధ్యక్షులు అరిగెల సూరిబాబు, రాష్ట్ర ఎస్‌సి సెల్ నాయకులు పెదపూడి శ్రీను,కత్తుల బాబులు తదితరులు ఉన్నారు. **కపిలేశ్వరపురం.** కపిలేశ్వరపురం మండలంలోని నేలటూరు, వెదురుమూడి, కపిలేశ్వరపురం గ్రామాలలోని పంట పొలాలను బుధవారం ఎఒ బి రవి పరిశీలించారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో మండలం లో ని 6602 హెక్టార్ల వరి పంట లకు గాను సుమారు 3882 హెక్టార్లలో వరి పంట నీట మునిగి నష్టానికి గురి అయినట్లు మండల వ్యవసాయ అధికారి బి రవి తెలిపారు. మునిగిన పంట ను రక్షించుకునేందుకు రైతులు పొలాల్లో నీరు బయటకు పోయేందుకు కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతుల పలు సూచనలు చేశారు. పంట నష్టపరిహారం అంచనా కోసం గురువారం నుంచి గ్రామ స్థాయి బృందాలు పొలాలను పరిశీలించి నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు. **కాట్రేనికోన:** మండల వ్యాప్తంగా 5426 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా మొంథా తుఫాను కారణంగా సుమారుగా 2650 ఎకరాలు విస్తీర్ణంలో వరి పంట పొలాలు నీట మునిగాయని మండల వ్యవసాయ శాఖ అధికారిని బి.మదుల తెలిపారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సిబ్బందితో పంట పొలాల పరిశీలన క్షేత్రస్థాయిలో చేస్తున్నామని తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చెయ్యారు, ఉప్పూడి, లక్ష్మీవాడ, కాట్రేనికోన , కంది కుప్ప, నడవపల్లి,తదితర గ్రామల పరిధిలోని పంట పొలాలను పరిశీలిన చేసామన్నారు. ఈ సందర్భంగా నీట మునిగిన పంటకు వచ్చే తెగుళ్ల నివారణకు చర్యలు ఏ విధంగా తీసుకోవాలో రైతులకు సూచిస్తుమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** మండలం లోని కట్టుంగ, నార్కేడిమిల్లి, వసంతవాడ, పులిదిండి, వద్దుపర్రు, వెలిచేరు గ్రామాలను కొత్తపేట ఆర్‌డిఒ శ్రీకర్ తో కలిసి తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకష్ణ, ఆత్రేయపురం మండల ఎన్‌డిఎ కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. **రావులపాలెం:** మండలపరిధి ఈతకోటలో పర్యటించి, తుఫాను వల్ల దెబ్బతిన్న వరి పొలాలను ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పరిశీలించారు .ప్రభుత్వం వరి పంటకు ఎకరాకు రూ.8,000, అరటి పంటకు ఎకరాకు రూ.14,000, కూరగాయల పంటలకు ఎకరాకు రూ.10,000 ఇప్పటికే ప్రకటించిందనీ ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆకుల రామకష్ణ, గుత్తుల రాంబాబు, ముత్యాల బాబ్జి,కొప్పిశెట్టి ప్రసాద్, యర్రంశెట్టి బుజ్జి, కాసా సాగర్, జక్కంపూడి బాలాజీ, చిన్నం శ్రీనివాసరెడ్డి, పెచ్చేటి చిన్నారావు, వ్యవసాయ శాఖ,ఉద్యానశాఖ అధికారులు,కూటమి నాయకులు పాల్గొన్నారు. మండలంలో పొడగట్లపల్లి, గోపాలపురం, దేవరపల్లి, ఈతకోట, రావులపాడు, లక్ష్మీపోలవరం గ్రామాల్లో వరి పంట దెబ్బతింది.




ఓదూరులో నేలకొరిగిన పంట చేలు పరిశీలిస్తున్న మంత్రి సుభాష్



ఉప్పలగుప్తం లో దెబ్బతిన్న వరి చేలను పరిశీలిస్తున్న ఎడి కెనడీ

కార్టూ'నిజం'



బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో సంభవించిన మొంథా తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రజలను, రైతుల్ని తక్షణమే కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. తుపాను అనంతరం ప్రభుత్వం చేపట్టాల్సిన సహాయక చర్యలు మరియు సేవా కార్యక్రమాలపై కారెం వెంకటేశ్వరరావు మాట్లాడారు. మొంథా తుపాను కారణంగా ఇళ్లు కోల్పోయిన, పాక్షికంగా దెబ్బతిన్న ప్రతి కుటుంబానికి నష్టపరిహారం వెంటనే అందించాలని అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతంలో రూ. పది వేల జీవన భృతి అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు పూర్తి పరిహారం, పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి సరిపడా రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరార. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తుపాను బాధి తులైన ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువులు, 50 కేజీల బియ్యం, పప్పు, నూనె, కూరగాయలు, దుప్పట్లు మొదలైనవి పంపిణీ చేయాలని అన్నారు. తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్తు స్తంభాలు, తీగలు మరమ్మతులు చేసి వెంటనే విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలని అన్నారు. వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కాలువలు తక్షణమే మరమ్మతులు చేసి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని అన్నారు. అవకాశం ఉన్న మేర ఆర్‌టిసి బస్సులను నడిపేందుకు ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన మందులు, వైద్య సేవలు ఉచితంగా అందించాలని ఆయన కోరారు. కలుషితమైన తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామంలో శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాలని కారెం వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

తుపాను బాధితులకు అండగా ఉంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ హరీష్, ఎంఎల్ఎ సుబ్బరాజు

ప్రజాశక్తి - కాట్రేనికోన

తుపాను ప్రభావిత గ్రామ ప్రజలందరికీ కూటమి ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్ మాదుర్ పేర్కొన్నారు. తుపాను అనంతరం మండల పరిధిలోని తీర ప్రాంత మత్స్యకార గ్రామమైన పల్లం గ్రామంలో వారిద్దరూ బుధవారం సాయంత్రం పర్యటించారు. గ్రామం చుట్టూ గృహాల మధ్యలోకి వర్షపు నీరు చేరుకోవడంతో బాధిత ప్రజలను పరామర్శించి స్వయంగా పరిస్థితిని తెలుసుకున్నారు. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసే సాధారణ పరిస్థితి గ్రామాలలో వచ్చేంతవరకు మత్స్యకార గ్రామాల్లో పునరావాస కేంద్రాలు కొనసాగించాలన్నారు. బాధితులు అందరూ అధర్య పడవద్దని ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు. వందలాదిమంది సిబ్బందిని పెట్టుకుని 48 గంటలు అయినా కనీసం మండల కేంద్రానికి కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేకపోవడంతో ఆ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సిబ్బందిని సమన్వయ పరచడంలో పూర్తిగా మండల విద్యుత్ శాఖ అధికారులు విఫలమయ్యారని అన్నారు. స్వచ్ఛందంగా మండల ప్రజలే ఎక్కడికి ఎక్కడ కూలిన చెట్లను తొలగించినప్పటికీ విద్యుత్ శాఖ సిబ్బంది వాటిని పునరుద్ధరించడంలో విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి రాత్రికి ఎట్టి పరిస్థితుల్లో నూ కరెంటును పునరుద్ధరించాలని ఆ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

కొనసాగిన రవికుమార్ దీక్ష

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌ను వెంటనే పునరుద్ధరించి, బస్సు లను నడపాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమిల్లి రవి కుమార్ చేపట్టిన రిలే దీక్ష కొనసాగింది. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక సమైఖ్యాంధ్ర శిబిరం వద్ద రవి కుమార్ చేస్తున్న రిలే దీక్ష బుధవారం 19 రోజుకు చేరుకుంది. రవి కుమార్ మాట్లాడుతూ ప్రయాణికుల ప్రయోజనాలకు నష్టం కలిగించే విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రయాణికులు, విద్యార్థులు, మహిళలు, గర్భిణులు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా బస్టాండ్‌లోనే బస్సులు ఎక్కి, దిగేవిధంగా మౌలిక సౌకర్యాలు కల్పించి, నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌లో 24 గంటలు బస్ లు తిరిగేలా చర్యలు తీసుకోవాలని దీక్ష చేస్తుంటే అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌కు బస్సులు రాకపోకలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి దీక్షను కొనసాగిస్తానని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని ముచ్చిమిల్లి రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన భూర్ల చైతన్య(25)అనే యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఎలక్ట్రికల్ వర్క్ చేసే చైతన్య బుధవారం ఒక కళ్యాణ మండపం లో పనిచేస్తూ ఇనుప స్తూలు తీసుకుని వెళుతుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు స్తూలుకు తగిలి విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. వెంటనే అతనిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అవివాహితుడైన చైతన్య కు తల్లిదండ్రులు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ షాక్‌తో ప్రయివేటు ఎలక్ట్రీషియన్ మృతి

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి గ్రామంలో మొంథా తుపాను కారణంగా ధ్వంసం అయిన విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో విషాదం నెలకొంది. సఖినేటిపల్లి లైన్మెన్ వద్ద ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ పనిచేస్తున్న సఖినేటిపల్లి గ్రామానికి చెందిన యర్ర శంకర్ (44) ప్రమాదశాత్తు విద్యుత్ షాక్ గురై మృతి చెందారు. సఖినేటిపల్లి సిఎంఎల్ జూనియర్ కళాశాల వద్ద విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా, సఖినేటిపల్లి సబ్ స్టేషన్ విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యుత్ సరఫరా చేయడంతో మరమ్మతులు 11 కెవి విద్యుత్ లైన్ నేరుగా షాక్ తగిలింది. దీంతో మరమ్మతులు చేస్తున్న శంకర్ కరెంట్ స్తంభంపై నుంచి కిందపడిపోయాడు. అతనిని ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు తెలుస్తుంది. మృతుడు శంకర్ కు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. గతంలో ఇదే విద్యుత్ స్తంభం పై ఒక ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలుపుతున్నారు. దీనిపై తమకు ఏ విధమైన ఫిర్యాదులు అందలేదని సఖినేటిపల్లి పోలీసులు తెలుపుతున్నారు.

తుపానుకు పశువుల మృత్యువాత

ప్రజాశక్తి - సీతానగరం

మొంథా తుపాను ప్రభావం వల్ల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కూనవరం గ్రామానికి చెందిన రైతు నల్లమోలు సుబ్బారావుకి చెందిన ఒక పాడి గేదె మృత్యువాత పడింది. జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి రైతును పరామర్శించారు. నష్ట పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. ఈ మేరకు నివేదికను అందించాలని పశువైద్యాధికారిని ఆదేశించారు.

సఖినేటిపల్లి : మొంథా తుపాను నుంచి మూగజీవులు తప్పించికోలేక పోయాయి. అంతర్వేది కర గ్రామం సెయింట్ మేరీ స్కూల్ వెనుక ప్రాంతంలో ఆంబోతు సరుగుడు తోటల్లో ప్రాణం విడిచింది. అంతర్వేది ఆలయ సమీపం నుండి పదుల సంఖ్యలో గోవులు, ఆంబోతులు రోడ్లపై తిరుగుతుంటాయి. ఆకోవలో సముద్రతీరంలో ఉన్న ఆం బోతు కెరటం తాకిడికి నీటమునిగి చనిపోయి ఉండ వచ్చని స్థానికులు భావిస్తున్నారు. అంతర్వేది ప్రధాన రహదారిపై ఎన్నో ఆవులు, ఆంబోతులు ఉండేవి. తుఫాను తర్వాత వాడి జాడ కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

31న గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈనెల 31న గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మహమ్మద్ అలీషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సమావేశం హాల్లో నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలన్నాని ఈ సందర్భంగా కమిషనర్ కోరారు.

నేడు పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని 24 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణపై కౌన్సిల్ ఆగ్రహం

ప్రజాశక్తి - పిఠాపురం

పారిశుధ్య నిర్వహణపై కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు సోమరౌతు లలితదేవి, అల్లవరపు నగేష్ మాట్లాడుతూ శానిటేషన్ శుభ్రపరిచేందుకు పుష్కాట్లు, ట్రాక్టర్లు పనిచేయడం లేదని, దీంతో పట్టణం అంతా మురికికూపంగా మారిందన్నారు. కౌన్సిలర్ బోనాసుల శివ మాట్లాడుతూ డ్రైవర్స్ కాలనీ సమీపంలో ఆక్రమణలు అధికంగా ఉండడంతో వర్షపు నీరు రోడ్డుపై ప్రహించి ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందని అన్నారు. అక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ బోను దేవా మాట్లాడుతూ కాంట్రాక్టర్ దివాణంను కౌన్సిల్ ఆమోదంతో బ్లాక్ లిస్టులో పెడితే అతనకు మరల పనులు ఎలా అప్పగిస్తున్నారని ప్రశ్నించారు. కౌన్సిల్ ఆమోదించిన అభివద్ధి పనులకు టెండర్లు పిలిచి త్వరితగతన పనులు పూర్తి చేయాలని కోరారు. ఉప్పాడ బస్ స్టాండ్ సెంటర్‌లో ఉన్న చిన్నమాంబ పార్కు చుట్టూ ఆక్రమణలు అధికమయ్యాయని, ప్రయివేటు వ్యక్తుల వాటిని ఆక్రమించుకుని రోజు వారి వ్యాపారాలు సాగించే వర్తకుల నుంచి రోజుకు సుమారు రూ.500 వసూలు చేస్తున్నట్లు కౌన్సిలర్ నగేష్ ప్రస్తావించారు. వివిధ శాఖల అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

తుపాను సహాయక చర్యలపై సమీక్ష



సమావేశములో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు జిల్లాస్థాయి అధికారులు ప్రజాప్రతినిధులతో మొంథా తుపాను సహాయక చర్యలపై బుధవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, ఉద్యాన, మార్కెటింగ్, డైయిరీ డెవలెప్మెంట్, మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుపాను మూలంగా ముందుగా ఊహించినంతగా తీవ్రత లేకపోయినప్పటికి విద్యుత్ సరఫరా రోడ్డు రవాణా రాకపోకలకు ఇబ్బందిని కలిగించిందన్నారు. తుపాను కారణంగా సంభవించిన ఈదురు గాలుల మూలంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 300 విద్యుత్ స్తంభాలు నేలకొరి గాయన్నారు. వాటి పునరుద్ధరణ పనులు 80 శాతం వరకు నిర్వహించామన్నారు. జిల్లావ్యా ప్తంగా 54 సబ్ స్టేషన్ లపై తుపాను ప్రభావం పడిందన్నారు. మొదటి ప్రాధాన్యతగా ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. జిల్లావ్యాప్తంగా 134 కిలోమీటర్ల మేర రహదారులపై నేలకొరిగిన భారీ వక్షాలను తొలగించి రహదారులపై రాకపోకలు పునరుద్ధరణ ఇప్పటికే పూర్తయిందన్నారు. నేటి నుంచి ఆర్టీసీ బస్సులు నూటికి నూరు శాతం రాకపోకలు సాగించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తం గా 400 పునరావాస కేంద్రాలు నిర్వహించి 10, 150 మందికి ఆశ్రయం కల్పించడం జరిగిందని తెలిపారు. వీరిలో కుటుంబానికి రూ3 వేలు చొప్పున ఒంటరి సభ్యులకు రూ.1000 చొప్పున ఆర్థిక సహాయం పంపిణీ చేయా లన్నారు. నేటి నుంచే బియ్యం పంపిణీ ప్రక్రియను రేషన్ డీలర్ల ద్వారా సరఫరా చేయాలని జెసి టి.నిషాంతిని ఆదే శించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాల లో వరి పంట తుఫాన్ ప్రభావం తో నష్టా నికి గురైందని ప్రాథ మికంగా అంచనా వేశామన్నారు. వరి, ఉద్యాన పంటల నష్టానికి సంబంధించిన అంచనాల బందాలు నియమించి నియమించి పూర్తిస్థాయి నివేదికను గణించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మొంథా తుఫాన్ సహాయక చర్యల ప్రత్యేక అధికారి వి.విజయరామరాజు, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ స్థానిక ఎంపీ జి.హరీష్ మాదుర్, జిల్లా ఎస్‌పి రాహుల్ మీనా, జెసి టి.నిషాంతి, ఎంఎల్ఎలు అయితాబత్తులు ఆనందరావు, నిమ్మకాయల చిన్న రాజప్ప, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మెట్ల రమణబాబు డిఆర్ఒ కె.మాధవి తదితరులు పాల్గొన్నారు.



వరి పంట నష్టంపై అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యానందరావు

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - కొత్తపేట

మొంథా తుఫాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన నియోజకవర్గంలోని కొత్తపేట మండలం రామనూతిమెరక, రావులపాలెం మండలం ఈతకోట, అలమూరు మండలం పెనికేరుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి తుఫాను వల్ల దెబ్బతిన్న వరి పొలాలను, అరటి పంటను పరిశీలించారు. కొత్తపేట నియోజకవర్గంలో తుఫాను ప్రభావంతో పలు చోట్ల చెట్లు పడిపోవడం, విద్యుత్ స్తంభాలు నేలకొరగడం జరిగిందన్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించామన్నారు. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముప్పు తప్పిందన్నారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న కుటుంబాలకు రూ.3వేల చొప్పున అందించడం జరుగుతుందన్నారు. వేగంగా వీచిన గాలుల ప్రభావంతో నియోజకవర్గంలో ఎక్కువగా వరి పొలాలు నేలకొరిగాయని, అరటి పంట దెబ్బతిందన్నారు. మరో 15 నుంచి నెల రోజుల్లో పంట చేతికొచ్చే దశలో తుఫాను రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎంఎల్ఎ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారిని ఆదుకుంటుందని తెలిపారు. . ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. ఇందుకు విశేషంగా కషిచేసిన ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఎడి మరియు హార్టికల్చర్ అధికారులు, ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, ముత్యాల బాబ్జి, గనిశెట్టి వీరేష్, కొప్పిశెట్టి ప్రసాద్, యల్లమెల్లి జగన్మోహన్, యర్రంశెట్టి బుజ్జి,కాసా సాగర్, జక్కంపూడి బాలాజీ, చిన్నం శ్రీనివాసరెడ్డి, పెచ్చేటి చిన్నారావు గొడవర్తి బాబి, కోన శ్రీనివాస్, గొడవర్తి భాస్కరరావు,వైట్ల రామారావు,శీలం వెంకటరమణ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిహెచ్‌ఓ అప్పారావు, సిబ్బంది

వ్యాధుల నుంచి తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట పిహెచ్‌సి ఆధ్వర్యంలో మాచవరం నాలుగో వార్డు సచివాలయం-1లో కుమ్మరి వీధిలో దోమలు వ్యాప్తితో వచ్చే వ్యాధుల నుంచి రక్షణ చర్యలపై బుధవారం అవగాహన కల్పించారు. జ్వరం వస్తే పిహెచ్‌సికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవచ్చునని సిహెచ్‌ఒ బి.అప్పా రావు సూచించారు. మంచినీటిని కాచి చల్లార్చిన తర్వాత తాగాలని అవగాహన కల్పించారు. శీతా కాలం దృష్ట్యా కాలువలో లభించే వివిధ రకాల చేప లను ఆహారంగా తీసుకోవడం ద్వారా వృద్ధులు, చిన్నారులు ఎక్కువగా అనారోగ్య సమస్యల బారిన పడతారన్నారు. రెండు వారాల నుంచి ఎవరికైనా దగ్గు వస్తే కళ్ళె పరీక్ష చేయించు కోనట్లయితే ప్లస్ పాజిటివ్ వస్తే ఆరు నెలలకు సరిపడా టిబి మం దులు వాడితే క్షయ వ్యాధిని అరికట్ట వచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎ లు అజ్జమ్మ, ఆశా బి.నాగవేణి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి రూ.5 వేల సాయం

ప్రజాశక్తి - మామిడికుదురు

మొంథా తుపాన్ లో తాటి చెట్టు పడి మరణించిన మాకనపాలెం కిచెందిన గుడపల్లి వీరవేణి కుటుంబ సభ్యులు ఏడుకొండలు, జానకిరామ్‌లను జెడ్‌పి మాజీ చైర్మన్ నామనరాంబాబు బుధవారం పరామర్శించారు. అనంతరం నామన ఫౌండేషన్ ద్వారా రూ.5వేల చెక్కును మృతురాలి కుటుంబానికి అందజేశారు. ఎంఎల్‌సి సోము వీర్రాజు, మాజీ ఎంఎల్ఎ ఎంఎ వేమా, పాలూరి సత్యానందం మృతు రాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని అన్నారు. కార్యక్రమంలో నగరం రూరల్ బ్యాంకు ఛైర్మన్ ఈలి శ్రీనివాస్, మామిడికుదురు సర్పంచ్ గౌసేమోహిదీన్ కూటమి నాయకులు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు

పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. బాధితులకు అందుతున్న వసతి సౌకర్యాలు గురించి ఆరా తీశారు. వర్షాలు పూర్తిగా తగ్గేంతవరకు బాధితలంతా పునరావాస కేంద్రంలోనే ఉండాలని ఆయన సూచించారు. బాధితులకుఅసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఉపాధి హామీ గ్రామ సభలు వాయిదా

ప్రజాశక్తి - సీతానగరం

తుపాను కారణంగా రాపాక, సీతానగరం గ్రామాల్లో జరగాల్సిన ఉపాధి పనులు గుర్తింపు గ్రామసభలు రద్దు చేసినట్లు ఎపిఒ సత్యవతి తెలిపారు. తుపాను కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వాతావరణం పూర్తిగా అనుకూలించిన తర్వాత తిరిగి గ్రామసభలను నిర్వహిస్తామన్నారు. త్వరలోనే తేదీలను ప్రకటిస్తామన్నారు.

త్వరలో పంట బోదె సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ నామాలతోట వారి కాలనీ వద్ద ఎప్పటినుండో ఉన్న పంట బోదె సమస్యను ఎంఎల్ఎ బండారు సత్యానందరావు బుధవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పంట బోదె సరిగా లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు, వర్షాకాల సమయంలో వరద నీరు వల్ల పరిసర ప్రాంతంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సమస్యను ఎంఎల్ఎ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే స్పందించిన ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించి ఆయన అధికారులతో మాట్లాడి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొడవర్తి దుర్గాప్రసాద్ , నామాల సూరిబాబు, మేడపాటి రామారెడ్డి, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, ఎంపిటిసి సభ్యుడు మారిశెట్టి శ్రీనివాస్, తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, ఎంపిడిఒ ఎ.రాజు, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీ ప్రత్యూష, వ్యవసాయ అధికారిని మీనా,తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది పల్లిపాలెం సందర్శించిన కలెక్టర్, ఎంపీ

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

ఈ నెల 28వ అర్ధరాత్రి మొంథా తుపాను అంతర్వేది తీరంతాకిన వార్త విన్న తదుపరి అమలాపురం ఎంపీ హరీష్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వేర్వేరుగా అంతర్వేది చేరుకొన్నారు. ప్రమాదకర పరిస్థితిలో సైతం ఎంపీ అంతర్వేది చేరుకొని పల్లిపాలెం తుపాను ఆశ్రమ భవనం వద్ద ఉన్న భాధితులతో మాట్లాడారు. తీవ్రమైన గాలులు వేస్తూ, వాతావరణం భయానకంగా ఉన్న సమయంలో సైతం ఎంపీ తమ కోసం రావడంపై భాదితులు ఆనందం వ్యక్తం చేయడంతో, ఆయన సైతం జాగ్రత్త వహించాలనిసూచించారు. గాలుల తీవ్రతకు ఎవరు భయటకి రావొద్దని, ప్రభుత్వం మిమ్మల్ని అన్ని విధాలా ఆదుకోంటుందని అయన తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుపాను ప్రమాదం తప్పిందన్నారు. ప్రజలు అధికారులకు సహకరించాలని అయన కోరారు. మరో రెండు రోజులు జాగ్రత్తగా ఉండాలన్నారు.తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, టిడిపి నాయకులు అయన వెంటఉన్నారు.

బాధితులకు పలువురి సాయం



నాగాబత్తుల సాహెబ్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా భోజన ఏర్పాట్లు

ప్రజాశక్తి - యంత్రాంగం

మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో అధికారులు పునరావస కేంద్రాల ఏర్పాటు చేశారు. బుధవారం పలువురు బాధితులకు రగ్గులు పంపిణీ చేశారు. పలువురు భోజనాలు ఏర్పాట్లు చేశారు.

అంబాజీపేట: మండల పరిధిలో తుపాను ప్రభావంతో వంట చేసుకోవటానికి సౌకర్యం లేనికుటుంబాల వారికి నాగాబత్తుల సాహెబ్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా భోజన ఏర్పాట్లు చేశామని మాచవరానికి చెందిన ట్రస్ట్ ఛైర్మన్ నాగాబత్తుల వెంకట సుబ్బారావు తెలిపారు.తుపాను ప్రభావితంతో ఇబ్బందులు పడుతున్న 200 మందిని గుర్తించి భోజన సదుపాయం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో గోసంగి సత్యనారాయణ, మంచాల ఇరబ్బాయి, గుత్తుల రామకృష్ణ, ఎలమంచిలి బుచ్చిబాబు, కత్తుల బాబులు, పులిదిండి శేఖర్ ,తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: తుపాను సందర్భంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోని బాధితులకు బుధవారం పలువురు సాయం అందించారు.గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో గ్రామంలోని అమ్మ సిల్క్స్ అధినేత కాశిన శ్యాం సుందరరావు బాధితులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, ఎంపిటిసి సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, నాయకులు మద్దింశెట్టి సురేష్, అరిగెల నరేష్, గనిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.



గొల్లవిల్లి పునరావాస కేంద్రంలో రగ్గులు అందిస్తున్న నాయకులు

'అర్హులందరికీ ఇళ్లు కేటాయిస్తాం'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

అర్హులందరికీ ఇళ్లు కేటాయిస్తామని టిడిపి ఆరోగ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ తెలిపారు. ఒడియాపేట, టవర్ సెంటర్ కింద ఉన్న రేకుల షెడ్డులను ఆయన బుధవారం పరిశీలించారు. ఇళ్ల సమస్య ఎంఎల్ఎ గోరంట్ల దృష్టిలో ఉందని త్వరలోనే పరిష్కారం చూపుతారన్నారు. ఈ రెండు రోజులు అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉండాలని సూచించారు. ఆయన వెంట టిడిపి రూరల్ మండల అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షులు దుద్దుపూడి రమేష్, కో క్లస్టర్ బొప్పన నానాజీ, గారపాటి నాగేశ్వరరావు, కొల్లి దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

చంటియ్య కుటుంబానికి జగ్గిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని పెదపళ్ళకు చెందిన మృతుడు మూరా చంటియ్య కుటుంబ సభ్యులను వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చంటియ్య చిత్రపటం వద్ద జగ్గిరెడ్డి, నాయకులు నివాళులర్పించారు. చంటియ్య కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట కర్రీ నాగిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, వైసిపి సీనియర్ నాయకులు నెక్కింటి బుజ్జి, ఏడిద మెహర్ ప్రసాద్, నూకపెయ్య సూరిబాబు, మేడవరపు లక్ష్మణరావు, గంట శ్రీనివాస్, దొడ్డారపు సుబ్బారావు, అలుగోజు శ్రీనివాసరావు, తదితర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైతులను ఆదుకునేలా చర్యలు

ప్రజాశక్తి - కాజులూరు

తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వళ్ల రాజబాబు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని శీలలంక, కాజులూరు, సేదువాడ గ్రామాల్లో ఆయన పర్యటించారు. రైతులను కలుసుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వరి పంట నేలనంటిందని అన్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.30 వేల వరకూ పెట్టుబడి పెట్టారని, కావున ప్రభుత్వం తక్షణమే పంట నష్టం అంచనా వేసి ప్రతి సాగుదారునికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నష్టం అంచనాకు ప్రత్యేక బృందాలు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

మొంథా తుపాను పంట నష్టం అంచనాలు వేసేందుకు రెండు రోజుల్లో ప్రత్యేక అధికారుల బృందాలను పంపిస్తానని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజవరపు అచ్చం నాయుడు అన్నారు. బుధవారం ఆయన తుపాను ప్రభావిత ప్రాంతమైన అంతర్వేది పల్లిపాలెం గ్రామంలో ఆయన పర్యటించి భాదిత లతో మాట్లాడారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షించి, ముందస్తు చర్యలు తీసుకోవడంతో ప్రాణం నష్టం సంభవించకుండా అరికట్టామని మంత్రి తెలి పారు. జిల్లా వ్యాప్తంగా పదివేల మందికి ఆశ్ర మం ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఆశ్రమ భవనాల నుంచి ఇంటికి వెళ్లే ప్రతి ఒక్క కుటుం బానికి రూ.3వేల చొప్పున సాయం అందిస్తామ న్నారు. అదేవిధంగా ఇబ్బందులకు గురవుతున్న చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం పంపిణీ చేస్తామన్నారు. నష్టంవాటిల్లిన ఉద్యానవన పంటలు, వ్యవసాయం, అరటి పంటల రైతులను ఆదుకుంటామన్నారు. అంతర్వేది పూర్తిగా నీట మునిగిపోవడం చూస్తుంటే ఆవేదనగా ఉందన్నారు. అంతర్వేది తీరంలో డ్రెయిన్స్ వ్యవస్థ అధ్వానంగా ఉందని, దీనికారణంగా ప్రజలు ముంపునకు గురవుతున్నారని, ఈ విషయమై రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ పలుమార్లు తన దృష్టికి ప్రభుత్వం దష్టికి తీసు కొచ్చారని త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం కనుగొంటామన్నారు. వశిష్ట గోదావరి తీరం గ్రోయిన్స్‌ని మంత్రి స్థానికులతో కలిసి సందర్శిం చి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తొలిత ఆయన అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్, రాజోలు టిడిపి ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య, స్థానిక నాయకులు వనమాలి మూలస్వామి, తిరుమాని ఆచార్యులు, పెద్దకాపు, గుబ్బల ఫణి, బందెల పద్మ, చినబాబు రాజు, బర్రె శ్రీను, రత్నమాల, గొల్ల జేష్పాల్ తదితరులు పాల్గొన్నారు.



అంతర్వేదిలో విలేకరులతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

దెబ్బతిన్న అరటి తోట పరిశీలన

ప్రజాశక్తి - మామిడికుదురు

లూటుకుర్రులో తుపాను ప్రభావంతో గని శెట్టి నాగేశ్వరరావుకు సంబంధించిన నాలుగు ఎకరాలు అరటి తోట నేలమట్టమైంది. దెబ్బతిన్న అరటి తోట రైతును బుధవారం నియోజకవర్గ వైసిపి కన్వీనర్ గన్నవరపు శ్రీనివాస్, పార్టీ నాయకులతో కలిసి కలిసి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. రూ.లక్షలలో పెట్టు బడి పెట్టామని పంట దిగుబడి సమయం లో తుడుసు పెట్టు కు పోయిందని బాధిత రైతు గన్నవరపు కు వివరించారు